క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌గా శంకరరావు


పైల శంకరరావు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పైల శంకరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి బదిలీపై వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లిపోవడంతో స్థానిక జూనియర్ కళాశాలలో వాణిజ్య శాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్న శంకరరావుకు ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు.

అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, అవి వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశమైన ఆయన వర్షాల కారణంగా అపరిశుభ్రత పేరుకుపోకుండా పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని తెలిపారు. బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు.

జాగ్రత్తలతో చీడపీడల నివారణ


పెద్దదిమిలిలో వేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భామిని: పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటిస్తే పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని సీతంపేట ఏఆర్ఎస్(వ్యవసాయ పరిశోధన కేంద్రం) శాస్త్రవేత్తలు పి.సీతారాం, పి.సౌజన్య తెలిపారు. మండలంలోని పెద్దదిమిలి, ఘనసర గ్రామాల్లో గురువారం పర్యటించిన వారు అక్కడి పొలాల్లో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. వరి చేనులో ఎక్కువగా జింక్ లోపం గుర్తించిన వారు జింక్ స్ప్రేయింగ్ చేపట్టాలని సంబంధిత రైతులకు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ పార్వతి

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతంపేట వాసి నాగవంశపు ధర్మారావుకి వలంటీర్ కె.పార్వతి గురువారం పెన్షన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మరీ ప్రభుత్వం పంపిణీ చేసిన పెన్షన్ అందివ్వడంతో ప్రభుత్వం, వలంటీర్ సేవలపై బాధిత బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దోమల నివారణ మందు స్ప్రే చేయాలి

సీతంపేట: మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమైన దోమలను అరికట్టేందుకు దోమల నివారణ మందు స్ప్రే చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి శ్యామ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని మానాపురం గ్రామంలో దోమల నివారణ మందు స్ప్రే చేయడాన్ని పరిశీలించిన ఆయన వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వ్యాధుల బారిన ప్రజలు పడకుండా పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చిరంజీవి మాట్లాడుతూ వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తమై, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఫీవర్ సర్వే పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాను ప్రతాప్, సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది తొలుత పిల్లల బరువు, ఎత్తు కొలిచిన తర్వాత హెచ్‌బీ పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్యం మెరుగుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

గోపీనాథుని భూములు అప్పగించండి

భామిని: మండలంలోని లివిరిలో అన్యాక్రాంతమవుతున్న శ్రీగోపీనాథా రాధాకృష్ణుల ఆలయం పేరిట ఉన్న భూములను అప్పగించాలని ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఇదే విషయమై తహసీల్దార్ నీలాపు అప్పారావును గురువారం కలిసి, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గుర్తించిన గోపీనాథా రాధాకృష్ణుల పేరున 46.97 ఎకరాల భూమి గుర్తించడం జరిగిందని, ఆ వివరాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. లివిరి, సొలికిరి, లోహరిజోల గ్రామాల్లో దేవుని భూములున్నట్లు పేర్కొన్నారు. ఈ భూములు సాగు చేస్తున్న రైతులు కనీసం కౌలు కూడా చెల్లించడం లేదని, రానురాను అన్యాక్రాంతమవుతున్నాయని తెలిపారు.


పాలకొండ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచ్ కొండలరావు


పాలకొండ రూరల్: భాసూరులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


కురుపాంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి


గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ మండంగి రాధిక

తల్లిపాలే అమృతం

గ్రామగ్రామాన తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పంపిణీ చేసిన పౌష్టికాహార కిట్లు అందజేస్తున్నారు. మరోవైపు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టి, తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, శిశువు ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. లబ్ధిదారులంతా ఈ పౌష్టికాహారం సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని, పిల్లలను కూడా ఆరోగ్యంగా ఉంచాలని కోరారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్

‘జగనన్న సురక్ష’ ఓ చరిత్ర

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: అర్హులకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ఖచ్చితంగా అందేలా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఓ చరిత్ర సృష్టించిందని, నెల రోజుల వ్యవధిలో ప్రజలకు అవసరమైన అన్ని సేవలు ఈ కార్యక్రమం ద్వారా అందాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఇదే విషయమై మండలంలోని వండవ గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో గురువారం మాట్లాడిన వారు ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన, ప్రజాసమస్యలను స్వయంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించాలన్న వినూత్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించి, రాష్ట్రంలో సరికొత్త చరిత్రను సృష్టించారన్నారు. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తన ప్రతినిధులుగా అధికారులు, వలంటీర్లను నేరుగా ఇంటింటికీ పంపించి, ప్రజాసమస్యలను తెలుసుకుని, అవి తక్షణమే పరిష్కారమయ్యేలా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. అర్హులందరికీ కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 102 జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా 60,576 ఇళ్లకు వెళ్లి, సర్వే చేయడం జరిగిందని, ఈ సర్వేలో గుర్తించిన 39,175 సమస్యలపై అధికారులు పరిశీలించి, 38,804 మందికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లకు కృతజ్ఞతలన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- శ్రీకాకుళం, విశాఖ జిల్లాల సబ్‌జైళ్ల అధికారి బి.కృష్ణారావు


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సబ్‌జైళ్ల అధికారి కృష్ణారావు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శ్రీకాకుళం, విశాఖ జిల్లాల సబ్‌జైళ్ల అధికారి బి.కృష్ణారావు సూచించారు. గురువారం స్థానిక సబ్‌జైలును సందర్శించిన ఆయన రిమాండ్ ఖైదీలతో కాసేపు మాట్లాడి, వారికి అందిస్తున్న కనీస సౌకర్యాలపై ఆరాతీశారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. వేడిగా ఉన్నప్పుడే ఆహారం ఖైదీలకు పెట్టాలని, కాచిచల్లార్చిన తాగునీరు వారికి అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు సబ్‌జైలు రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, హెచ్‌సీ పి.చంద్రరావు, సిబ్బంది పి.మధు, హేమసుందర్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

భామిని: తనకు ప్రభుత్వం మంజూరు చేసిన డి–పట్టా భూమిలో తాను వేసిన వరిపంటను ఆక్రమణదారులు దున్నేసి, పాడుచేశారని మండలంలోని పెద్దదిమిలికి చెందిన రీసు జయమ్మ తహసీల్దార్ నీలాపు అప్పారావుకు గురువారం ఫిర్యాదు చేశారు. పంటను నష్టపరిచిన వారితోనే పరిహారం ఇప్పించేలా చేయాలని కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు పోటీ

- 184 సీట్లకు 522 మంది విద్యార్థుల హాజరు

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు గురువారం జరిగిన కౌన్సెలింగ్‌కు విద్యార్థులు భారీగా హాజరయ్యారు. మొదటి విడతలో 212 సీట్లకు గాను కేవలం 28 సీట్లు మాత్రమే నిండాయి. రెండో కౌన్సెలింగ్‌లో వివిధ ట్రేడ్‌లలో 184 మిగులు సీట్లు ఉండగా 522 మంది విద్యార్థులు వచ్చారు. అర్హతల ఆధారంగా సీట్లను అధికారులు కేటాయించారు. కౌన్సెలింగ్‌లో ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్ష


నాడు–నేడు పనులపై సమీక్షిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: పాఠశాలల్లో చేపడుతున్న మనబడి నాడు–నేడు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంఈఓ ఎన్.నాగభూషణరావు తెలిపారు. మండల కేంద్రంలో నాడు–నేడు రెండో విడత పనుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్షించిన ఆయన నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు పాటిస్తూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎంఈఓ కె.కొండలరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

భామిని: తన నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కృషి చేస్తున్నారని మండల ప్రత్యేకాహ్వానితులు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ ధర్మారావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో నిర్వహించిన సమావేశానికి హాజరైన గ్రామాల వారీగా గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు.

పక్కాగా ఓటరు సర్వే


వీరఘట్టం: బీఎల్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: పక్కాగా ఓటరు సర్వే చేపట్టాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో గురువారం సమావేశమైన ఆయన ఓటరు జాబితాలోని ప్రతీ ఓటరు ఇంటికి వెళ్లి, వారి వివరాలు సరిచూడడంతో పాటు వారి ఇంటి నంబర్‌ను నమోదు చేయాలని తెలిపారు. అలాగే మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ ఆర్.ఆనందరావు, ఈఓపీఆర్‌డీ వి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో తహసీల్దారు పి.సోమేశ్వరరావు గురువారం సమావేశమై, ఓటర్ సర్వేపై పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి, పక్కాగా సర్వే చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ బుచ్చయ్య పాల్గొన్నారు.

కథల పుస్తకాల పంపిణీ


కథల పుస్తకాలతో విద్యార్థులు

పాలకొండ రూరల్: మండలంలోని 20 ప్రాథమిక పాఠశాలలకు హర్షవెల్లి సాంస్కృతిక సాంఘిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో కథల పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. సంస్థ ప్రెసిడెంట్ నందన సుధాకర్, కార్యదర్శి తందాన సింహాచలం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతీ పాఠశాలకు 50 పుస్తకాల చొప్పున అందజేశారు. వీటితో ప్రతీ పాఠశాలలో మినీ లైబ్రరీ ఏర్పాటు చేసి, ఖాళీ సమయంలో పిల్లలతో ఆ కథల పుస్తకాలను చదించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు.

గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

జియ్యమ్మవలస: మండలంలోని తుంబలి, అల్లువాడ గ్రామాల దగ్గర నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఓ జేసీబీని పట్టుకుని, కేసులు నమోదు చేసినట్లు మైనింగ్ అధికారి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రూ.10 వేల అపరాధ రుసుం విధించి, వాహనాలను విడిచిపెట్టామన్నారు. అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మణిపూర్‌లో మారణహోమం ఆపాలి


కురుపాం మండల కేంద్రంలో ర్యాలీ చేపడుతున్న గిరిజన సంఘం నాయకులు

మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పలు ఆదివాసీ, గిరిజన సంఘాలు మన్యం బంద్ పాటిస్తూ ర్యాలీలు, మానవహారాలు గురువారం చేపట్టి, నిరసన తెలిపాయి. అక్కడ జరుగుతున్న మారణహోమం ఆపాలని ఆయా సంఘాల నేతలు కోరారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా, ఎంతోమంది ప్రాణాలు పోతున్నా, కేంద్రం స్పందించకపోవడం దారుణమైన చర్యగా అభివర్ణించారు. ఆదివాసీల హక్కులకు భంగం కలిగిస్తే తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తామని, ఇకనైనా ఈ దాడులను అరికట్టేందుకు మోదీ సర్కారు ముందుకు రావాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.


గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీలో గిరిజన సంఘాల నేతలు


సీతంపేటలో ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు


కొమరాడలో కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రిసోర్సు కేంద్ర ఏడీఏ శారద

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో వరినారు మడుల తయారీ, యాజమాన్య పద్ధతులు, కలుపునివారణ, వరి విత్తనాల ఉత్పత్తిలోని మెలకువలను జిల్లా రిసోర్సు కేంద్ర ఏడీఏ శారద వివరించారు. వరినాట్లు వేసే వారం రోజులకు ముందు మడులలో కార్బోఫ్యూరాన్ గుళికలు వేయడం ద్వారా ఆకుముడత పురుగు, కాండంతొలుచు పురుగు రాకుండా నివారించవచ్చన్నారు. దమ్ము మడిలో ఎకరాకు 40 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుంటే మొక్కలకు కావాల్సిన పోషకాలు అందడంతో పాటు పంట మొక్కలు ఏపుగా పెరుగుతాయన్నారు. వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కురుపాం డివిజన్ ఏడీఏ నిర్మల్ జ్యోతి, మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


పాలకొండ: వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేస్తున్న కౌన్సిలర్ పాపినాయుడు


భామిని: సుండి నందినికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎంపీటీసీ అన్నాజీరావు, సర్పంచ్ శాంతికుమారి

పాలకొండ: నగరపంచాయతీలోని పెదకాపు వీధికి చెందిన కిల్లారి సుగుణాకర్‌రావు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను గురువారం అందజేశారు. రెండు రోజుల క్రితం సుగుణాకర్‌రావు అనారోగ్యంతో మృతి చెందగా, ఈ మేరకు ప్రభుత్వం రూ.లక్ష బీమా సదుపాయం కల్పించిందని, ప్రస్తుతం రూ.10 వేలు అందజేశామని, మిగతా మొత్తాన్ని త్వరలో అందజేస్తామని వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు తెలిపారు.

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు చొప్పున అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన మీల కిశోర్, సుండి రాంబాబు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష బీమా పత్రం, రూ.10 వేలను ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారి చేతులమీదుగా అందజేశారు.

7న చలో కలెక్టరేట్


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమణరావు

పాలకొండ: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 7వ తేదీన చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమంను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను అన్ని విధాలా ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

- పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు


డెంగీ రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రితో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన జ్వర లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలందించాలని తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ వ్యాధిగ్రస్తులను పరిశీలించి, ఆరోగ్యం మెరుగుపడేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీన డీవార్మింగ్ డే నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు చేపట్టే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాల కోసం గుర్తించిన గర్భిణుల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం రేగులపాడు కేజీబీవీని సందర్శించి, వైద్య సిబ్బంది నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షలపై ఆరాతీశారు. రక్తహీనతతో బాధపడుతున్న ఐరన్ ఫోలిక్ మాత్రలు వేయించాలన్నారు. అనంతరం తంపటాపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేడు కడగండిలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

సీతంపేట: మండలంలోని కడగండి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి పార్టీ శ్రేణులు, అధికారులంతా హాజరు కావాలని ఆమె కోరారు.

వీరఘట్టంలోకి గజరాజులు

వీరఘట్టం: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతాలైన బిటివాడ, పి.వి.ఆర్.పురం, డెప్పివలస ప్రాంతాల్లోకి ఏనుగులు చొరబడినట్లు వీరఘట్టం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవికుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. మధ్యాహ్నం వరకు వంగర మండలంలోని సంగాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు సాయంత్రానికి వీరఘట్టం మండలం వైపు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.